ఖాళీగా ఉన్న అరుగు కన్పించగానే ప్రాణం లేచివచ్చినట్లైంది రామశర్మకు.

'నో వేకెన్సీ' బోర్డు లేని ఆఫీసులోకి నడిచినట్లు గబగబా నడిచివెళ్లి అరుగు మీది దుమ్మును 'ఉఫ్' అని వూది అక్కడ కూర్చున్నాడు.



# కర్మ కర్మ క్రియ

దీపావళి కథల పోటీలో బహుమతి పొందిన కథ

మధ్యాహ్నం పదకొండు గంటలనుంచి తిరుగుతున్నాడేమో, కాళ్లు ఒకటే లాగుతున్నై. కూర్చోగానే కొండంత బరువు దించినట్లుగా ఫీలైనాడు.

అంత పొద్దూ స్వతంత్రం కూర్చోటానికి అనువైన ప్రదేశం కన్పించింది ఇప్పుడే, ఇక్కడే.

'ఇదైనా ఏ పుణ్యాత్ముడో తాతలనాడు కట్టించిన ఇల్లై ఉంటుంది. లేకపోతే, ఈ కాలంలో అరుగు ఎవరు కట్టిస్తున్నారు?' అనుకుంటూ అరుగు మీద కూర్చొని తలుపులు తీసివున్న వాకిలిగుండా లోపలికి చూశాడు.

ప్రహరీలోపల శిథిలావస్థలోవున్న పెంకుటిల్లు తన వయస్సును దాచక చెప్తోంది. కుడివైపు మూలమీద వయసు మళ్లిన బాదంచెట్టు పెంకుటింటికి తోడుగా ఉంది. 'ఎవరిదో, బ్రాహ్మణుల ఇల్లులా వుంది' అనుకున్నాడు రామశర్మ.

బాదం చెట్టుపై కాకులు గోలగా అరుస్తున్నై. ఉండి, వుండి చెట్టుమీది నుంచి లేచి చెట్టుపైన ఆకాశంలో రెండు మూడు ప్రదక్షిణాలు చేసి మళ్లీ అదే చెట్టు మీద వాలుతున్నై.

**రూ. 600 లు**

**బహుమతి పొందిన కథ**

'నాలాగా వాటికీ ఈరోజుకి ప్రయాణం ముగిసింది. ఈ రాత్రికి హాయిగా, నిశ్చింతగా విశ్రాంతి తీసుకుంటాయి. తెల్లవారేక మళ్లీ ఆహారం కోసం చెట్టు విడిచి వెళ్తాయి.' ఇలా అనుకున్న రామశర్మకు ఈరోజు తను భోజనం చెయ్యలేదనే విషయం జ్ఞాపకం వచ్చింది. కడుపులో మంట ప్రారంభమైంది. నీరసం ఆవరించింది. సన్నగా నరము లాగుతున్నట్లు బాధగా వుంది. గోడకు చేరగిలి కళ్లు మూసుకున్నాడు.

“ఎవరు బాబూ నీవు?”

రామశర్మ కళ్లు తెరిచాడు. శిరోజాలు లేని తలపై ముసుగుతో నడి వయసు దాటి వృద్ధాప్యపు పొలిమేరల్లో అడుగు పెడుతున్న

ఒక స్త్రీ అతన్ని పరికించి చూస్తూ నిల్చుని వుంది

"నేనేనండి, నా పేరు రామశర్మ అంటారు..."

"రామశర్మా? వైదీకి బ్రాహ్మలా?" ఆప్యాయంగ అడిగిందామె.

"అవును బామ్మగారూ! శ్రీవత్స గోత్రం" ఆమె చూపిన ఆప్యాయతకు ప్రతిగా వరస కలుపుతూ చెప్పాడురామశర్మ.

"అలాగా" ఆమె సాలోచనగా చూస్తూ నిల్చుంది.

ఆమె యింట్లోకి వెళ్ళబోతూ తనను చూసి ఆగినట్లుగా ఇంటి వైపు తిరిగి నిల్చునివుంది. అంటే, ఈ ఇల్లు ఆమెదే నేమో. ఈ అరుగుమీద పడుకోనివ్వకుండా వెళ్ళమంటుందేమో! రామశర్మను భయం పట్టుకుంది. కాళ్ళ నొప్పులు, కడుపులో ఆకలి, వడుము లాగటం, శరీరమంతా ఆవరించిన నీరసం అతని భయానికి నలు వైపులా నిల్చినై.

"ఏవూరు నాయనా మీది? తల్లి,తండ్రి ఉన్నారా?" ఆమె మరికాస్త ఆప్యాయంగా వివరాలడుగుతోంది.

రామశర్మ వెంటనే జవాబు చెప్పలేదు. కారణం, అతనికి నిజం చెప్పడం ఇష్టం లేదు. తను ఈవూరి వాడినేనని, ఫలాని వారి అబ్బాయినని చెప్పుకోవాలనిపించలేదు. తను పన్నెండేళ్ళ క్రితం ఈ వూరు వదిలి వెళ్ళానని, వారాలు ఏర్పరచుకుని, చందాలు ఇప్పించుకుని బి. ఏ. పూర్తి చేసుకున్నానని, రెండు సంవత్సరాలనుంచి ఉద్యోగం కోసం ఊరూరూ తిరుగుతూ, భూమి గుండ్రంగా ఉందని నిరూపించటానికి మళ్ళీ పుట్టిన వూరికే వచ్చానని, తల్లిదండ్రులు తనని ఇంట్లోకి రానివ్వకుండా నెట్టివేశారని చెప్పి తనని తాను పల్చన చేసుకోవడం ఇష్టం లేకపోయిందతనికి. మరి ఆమె ప్రశ్నకు సమాధానంగా ఏదో అబద్ధం చెప్పాలి. ఏం చెప్పాలి? రామశర్మ ఆలోచనలో పడ్డాడు.

ఎంతకూ అతని నుండి సమాధానం రాకపోయేసరికి ఆమే తిరిగి అంది. "లోపలికి రా బాబూ! ఇది మా యిల్లే. పనిమీద ఊళ్ళోకి వెళ్ళి ఇప్పుడే వస్తున్నాను."

రామశర్మ ఆమెవెంట లోపలికి నడిచాడు.

కట్టుకున్న ధోవతి చెంగుకువున్న ముడి విప్పి అందులోని తాళం చెవితో తలుపు తాళం తీసింది ఆమె. అగ్గిపుల్ల గీచి లాంతరు వెల్గించి తెచ్చింది. రామశర్మను "కూర్చో" మని గోడవారగా వున్న ముక్కాలుపీట చూపింది. తనూ వాకిలి దగ్గరగా కూర్చుంది.

"కొంచెం మంచినీళ్ళిస్తారా బామ్మగారూ!" రామశర్మ అడిగేడు.

"నా మతి మండ! ఇంటికొచ్చినమనిషికి మంచినీళ్ళు కావాలా అనికూడా అడగలేదు" అని నొచ్చుకుని లోనికి వెళ్ళిందామె.

మూడు గ్లాసుల మంచినీళ్ళతో ఆకలి మంటను తాత్కాలికంగా చంపేశాడు రామశర్మ.

'బామ్మగారు మంచిదిలా వుంది, "ఈ పూట ఇక్కడే భోజనంచేయి నాయనా" అని అంటే ఎంత బాగుండును' అనుకున్నాడు రామశర్మ. కాని అంతలోనే 'పాపం బీద రాలుగా కనిపిస్తోంది. కాకపోతే వూరంతా కరెంటు వుంటే తన యింటికి పెట్టించు కోకుండా వుంటుందా? ఇలాంటివారి దగ్గర మంచితనమేగాని ఒకరిని ఆదుకునే ఆర్థిక స్తోమత ఉండదు' అనుకుని జారిపడ్డాడు.

"ఇందాకటి నా ప్రశ్నకు జవాబు చెప్ప లేదు నాయనా!"


'తను చెప్పలేని ప్రశ్నను ఇంటర్వ్యూ అధికారులు తిరిగి ప్రశ్నించినట్లైంది, ఆలోచనలలో నుండి తేరుకున్న రామశర్మకు. అడిగే ప్రశ్నలకు, ఇచ్చే ఉద్యోగానికీ సంబంధం లేనట్లుగానే తను అరుగు మీద కూర్చోటానికీ ఈవిడ అడిగే ప్రశ్నలకూ సంబంధ మేముంది ? పల్లెటూళ్ళలో లాగా అవసరం వున్నా లేక పోయినా పుట్టు పూర్వోత్తరాలన్నీ అడగటం ఈవిడకు అలవాటేమో' అనుకున్నాడు రామశర్మ.

"నేనిలా తరచి తరచి అడుగుతున్నానని ఏమీ అనుకోకు బాబూ ! ఇప్పుడు నాకో అవసరం ఏర్పడింది. అందుకు నీవేమైనా సాయపడతావేమోనని నీ వివరాలు అడుగు తున్నాను." అతని ఆలోచనలను పసికట్టి నట్లుగా అతని వివరాలడగటానికి కారణం చెప్పిందామె.

"చెప్పండి బామ్మగారూ ! నాకు చేతనైన సాయం ఏదైనా వుంటే తప్పక చేస్తాను."

"మీదేవూరు ?"

"ఏ వూరైతేనేం బామ్మగారూ; బి. ఏ.



పాసయి రెండేళ్ళ నుంచీ ఉద్యోగం కోసం దేశం పట్టుక తిరుగుతున్నాను. ఇంటర్వ్యూల అనుభవం వచ్చిందేగాని ఉద్యోగం రాలేదు. పట్టువదలని విక్రమార్కునిలా మళ్ళీ మళ్ళీ ఇంటర్వ్యూ లకు వెళ్తుంటాను ఉద్యోగం సాధించాలని ప్రయత్నిస్తుంటాను. నా ఈ ప్రయత్నంలో ఎన్ని ఊళ్ళు తిరగాలో. ఏవూటఎక్కడుంటే అదే నా వూరు. ఈవూటకు నాదీవూరే."

బామ్మగారు తర్వాత ప్రశ్న అడిగేరు "తల్లిదండ్రులున్నారా ?"

'ఇదీ ఇంటర్వ్యూ ప్రశ్నలాంటిదే. గుమస్తా ఉద్యోగం చేయటానికి ఘనా ప్రెసిడెంటెవరో, రోదసిలోకి వెళ్ళివచ్చిన కుక్క పేరేమిటో తెలియాల్సిన అవసర మేముంది ? తనకు తల్లిదండ్రులున్నా లేకపోయినా తను చేయగల్గిన సాయం చేస్తా నన్నాడుగదా ?' ఆ మాటే చెప్దామను కున్నాడుగాని, తనెందుకో నిజాన్ని దాస్తున్న ట్లుగా ఆమె పసికడ్తే...? అసలు ఆమెకు కావలసిన సాయమేమిటో తెలిస్తే అందు కనుగుణంగా తను జవాబు చెప్పొచ్చు. ఇంటర్వ్యూ అధికారుల మెంటాలిటీనిబట్టి అభ్యర్థి తన జవాబును 'మౌల్డ్' చేసుకున్నట్లు. కాని, ఆవిడకు కావలసిన సాయం ఏమిటి ? తను తప్పకుండా చేస్తా నన్నా చెప్పదేం ?

తన ప్రశ్నకు రామశర్మ జవాబు చెప్ప టానికి తటపటాయించడాన్ని మరోవిధంగా

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!



హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర తొలిముందు అసంతృప్తి, శుక్ల నష్టము, నపుంసకత్వము, పొల్నియ్యా, చర్మ వ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును.
వరిబీజము (బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ. రండి.

డా॥ దేవర, ఫోన్ 551,
మాంచాడి గుడి వద్ద, తెనాలి.

బ్రాంచి: 2౮, నార్త్ బోగ్ రోడ్, మద్రాసు-17.







ఆంధ్రప్రదేశ్‌లో ఏజన్సీలు ఇవ్వబడుచున్నవి
VIJAYA : MPM

# కర్త-కర్మ-క్రియ

అర్థం చేసుకుంది బామ్మగారు. అతని తల్లిదండ్రులు చనిపోయి వుంటారని, తన ప్రశ్న కదిలించిన వారి జ్ఞాపకాలు అతన్ని బాధపెట్టాయని, అందుకే అతను వెంటనే జవాబు చెప్పలేక పోతున్నాడని అనుకుంది. అనుకుని "వారు పోయారా నాయనా" అని జాలిగా ప్రశ్నించింది.

ఔనని తలూపేడు రామశర్మ అప్రయత్నంగా... మధ్యాహ్నం జరిగిన సంఘటన గుర్తుకొచ్చిందతనికి. 'అవును, నాకిప్పుడు తల్లిలేదు, తండ్రి లేడు, ఎవ్వరూ లేరు. ఈ లోకంలో నేను ఏకాకిని'. అలా అనుకోగానే అతని కళ్లలో నీళ్ళు నిల్చినై.

"పాపం! విచారపడకు నాయనా! విచారపడి మాత్రం మనం చేయగలిగినదేముంది? నీకూ, వాళ్లకూ ఋణం తీరిపోయింది. అందరం ఎప్పుడో ఒకప్పుడు వెళ్లిపోవలసిన వాళ్లమే బాబూ! కాస్త ముందు, వెనుక. అంతే తేడా. నా సంగతి చూడరాదూ, పిల్లా, పాప కలుగకుండానే ఆయన కాలం చేశారు. ఈ ఇల్లు తప్పితే మరో ఆధారం చూపించలేదు నాకు. అట్లాగే ఆ యింట, ఈ యింట వంటలు చేసిపెడుతూ పొట్ట పోసుకుంటున్నాను." కళ్లొత్తుకుంది బామ్మగారు.

'పాపం విచారపడకండి బామ్మగారూ...' ఆమె మాటల్ని ఆమెకే అప్పచెప్దామనుకున్నాడు రామశర్మ. కాని అలా చేయలేకపోయాడు. ఇంటర్వ్యూ అధికారుల్ని నొప్పించినందువల్ల ప్రయోజనమేమీ వుండదని అతని అనుభవం.

బామ్మగారు కళ్ళు ముక్కూ తుడుచుకుని అంది "రేపటికి పదేళ్ళు నిండుతాయి నాయనా, ఆ మహారాజు పోయి"

ఆ మహారాజెవరో రామశర్మకు వెంటనే అర్థం కాలేదు. చివరికి స్ఫురించింది ఆమె చెబుతున్నది ఆమె భర్తను గురించని.

ఆవిడ మళ్లీ అంది "ప్రతి ఏటా ఆయన తద్దినం శ్రద్ధగా పెట్టిస్తా నాయనా. ఎవరో నీబోటి తండ్రిని బ్రతిమాలుకుని అతని చేతిమీదుగా ఇద్దరు భోక్తలకు ఔపోసన వేయిస్తే, ఏ లోకాన వున్నా ఆ మహారాజు తృప్తి పడతాడు. నాకున్నంతలో ఏ లోటూ రానివ్వను. నాలుగు కూరలూ, నాలుగు పచ్చళ్ళూ, గారెలూ, అరిశలూ అన్నీ చేసి ఔపోసన వేయించుకున్న ఇద్దరికీ, వేసినాయనకూ ఐదేసి రూపాయల చొప్పున ఇస్తుంటాను." చివరి మాటలంటున్నప్పుడు ఆమె తన కళ్ళను పెద్దవి చేయటం లాంతరు వెలుగులో రామశర్మ గమనించక పోలేదు.

అప్పుడర్థమైంది రామశర్మకు ఆమె తనను కోరబోయే సాయమేదో.

తన భర్త బ్రతికుండగా బామ్మగారు ఆయన్ను తృప్తిపరచిందో లేదోగాని, ఆయన చనిపోయిన తర్వాత ఆయన తృప్తి పేరిట ముగ్గురు పేద బ్రాహ్మణులకు ఒకపూట కడుపునిండా తిండిపెట్టి ఐదేసి రూపాయల దక్షిణ ఇస్తోందని తెలుసుకుని సంతోషించాడు రామశర్మ. అయితే ఇప్పుడతనికి చిన్న సందేహం ఎదురైంది. ఇద్దరు భోక్తలతో తనను ఒక భోక్తగా ఉండమంటుందా లేక తనను భోక్తలకు ఔపోసన వేసే కర్తగా వ్యవహరించమంటుందా? ఏదైతేనేం, సునాయాసంగా ఐదురూపాయల సంపాదన, షడ్రసోపేతమైన భోజనం లభించబోతున్నాయి—కాలే కడుపుకు గంజినీళ్లు కాకుండా అమృతం దొరికినట్లు, తను చెప్పిన సమాధానాలు ఇంటర్వ్యూ అధికారిని తృప్తిపరచగా టెంపరరీదైనా ఉద్యోగం లభించినట్లు.

తాగిన మూడు గ్లాసుల మంచినీళ్ళు ఏమైనాయో కడుపులో క్షుధాగ్ని తిరిగి ప్రజ్వరిల్లుతోంది. రేపటి భోజనాన్ని తలుచుకుంటే ఇప్పుడే లాలాజల గ్రంథులు చురుకుగా పని చేస్తున్నాయి, ఎప్పుడో జరగబోయే ఇంటర్వ్యూకి ముందుగానే తయారయ్యే నిరుద్యోగిలా.

మరి, తెల్లవారితే తద్దినం గదా, ఇప్పటి వరకూ ఈమె భోక్తలను, కర్తను నియంత్రణ చేసుకోలేదా? రామశర్మలో మరో సందేహం తలెత్తింది.

"ప్రతియేటా వచ్చి తద్దినం పెళ్లబుచ్చే సుబ్బావధాని రేపు రావటానికి వీలుపడదని కబురు పెట్టేడు. కారణమేం లేదు, వాళ్ళకి పురుడొచ్చిందిట. మరొకరు దొరుకుతారేమోనని ఊరంతా తిరిగొచ్చాను. కాని ఎవ్వరూ వీలుపడదన్నారు. తిరిగి, తిరిగి కాళ్ళు నొప్పులుపుట్టి ఇంటికి వచ్చిన నాకు నీవు కన్పించి 'నా పేరు రామశర్మ' అని చెప్పేసరికి ప్రాణం లేచివచ్చినట్లైంది.

తనకిచ్చి నువ్వులనీళ్లొదలమని ఆ మహాతాపే నిన్నుపంపినట్లుంది'' అంటూ నవ్విందామె, సగం పూడిపోయిన పలువరుస కన్పించేలా.

"రామా బామ్మగారూ! ఏం పూటనుంచి వెళ్ళటానికి చార్జీ లేదాగా, ఈపూట ఆకలి తీరేదెలాగా అని ఆలోచిస్తున్న నాకు భగవంతుడే మా యింటి అరుగు చూపి ఆగిపొమ్మన్నాడు. పిల్చిన ఇద్దరు అయ్యర్లల్లో ఒకతను ఇంటర్వ్యూకి రాలేకపోయినట్లు పురుడుపిల్ల సుబ్బావధాని రాలేకపోవటం, రెండో అయ్యర్ది నేనే కావటం నా అదృష్టం'' అనుకున్నాడు రామశర్మ.

"నాయనా, అసలు నీకు ఒడుగైందా?'' సందేహంగా అడిగింది బామ్మగారు.

"అయిందండీ!''

"ఇకనేం, రేపు ఆ యిద్దరు బోక్తలకూ నీవే అపోసనపట్టేపుణ్యంకట్టుకో. క్షణంలో నీరు ఏర్పాటుచేసి పెడతాను, భోజనంచేద్దువు గాని. ఈపూట నే వెలాగా భోజనంచేయను గదా! గ్లాసెడు మజ్జిగనీళ్ళతో కడుపునింపుకుని పడుకుంటాను'' అంటూ వంటగది వైపు నడిచిందామె.

'రామశర్మకు గొప్ప చిక్కొచ్చి పడింది ఇప్పుడు. తనకు ఒడుగైన మాట నిజమే. కాని అందుకు దాఖలా ఏది? ఎప్పుడో చిన్నతనంలో తనకు ఉపనయనం జరగటం, చెవులు కుట్టించి పోగులు తగిలించటం, పంచ శిఖలు పెట్టించి వటువు వేషం పూర్తిచేసి తనకు వేదం చెప్పించాలని తండ్రి ప్రయత్నించటం, తనకదిష్టంలేక ఇంటో నుంచి పారిపోవటం గుర్తొస్తున్నాయి. హైస్కూల్లో చదివే రోజుల్లోనే చెవుల పోగుల్ని ఊడదీసేశాడు. ఉపనయనం అయిందన్నందుకు శాశ్వత చిహ్నమైన యజ్ఞోపవీతం చివికిపోయి జీర్ణమై ఏ క్షణంలో తన శరీరాన్ని వదిలిందో తనకే తెలీదు. మరిప్పుడు మెళ్లో జందెం లేదంటే ఏమంటాప్పాలి? నిజం చెప్తే? జందెన్ని విసర్జించిన నీవు తద్దినం పెట్టటానికి అనర్హుడ వంటుందేమో. రెండు పూటల భోజనం, ఐదు రూపాయలు తనకు దక్కవేమో. నో. నో. ఇలా జరగటానికి వీలులేదు. తన అవకాశాన్ని పోగొట్టుకోకూడదు.'

"బామ్మగారూ! ఇప్పుడేవస్తా'' అని చెప్పి బయలుదేరాడు రామశర్మ. బజారులో ఏ దుకాణంలోనో ఒక జందెం కొని మెళ్లో

# కర్త-కర్మ-క్రియ

వేసుకుంటే సరిపోతుందని నిర్ణయించుకున్నాడు. అప్పుడతనికి ఎదురుగ తెచ్చుకున్న సర్టిఫికెట్లతో ఒక ఇంటర్వ్యూకి వెళ్ళిన వైనం గుర్తుకొచ్చింది రామశర్మకు.

విఘ్నేశ్వరుడి పెళ్ళికి వేయి విఘ్నాలన్నట్టుగా రామశర్మకు మరో గండం ఎదురైంది మర్నాడు.

ఉదయం పదిగంటలకల్లా భోక్తలుగా నియమింపబడిన ఇద్దరు బ్రాహ్మణులూ వచ్చారు. వారిలో ఒకాయనను చూసి రామశర్మ నీరు కారిపోయాడు. ఆయన దీక్షితులు. రామశర్మకు తండ్రి.

దీక్షితులు కూడా రామశర్మను అక్కడ చూసి స్థాణువైపోయాడు. క్షణంపాటు




తండ్రీ, కొడుకులిద్దరూ ఒకరి నొకరు చూసుకుని వెంటనే చూపులు మరల్చుకున్నారు.

దీక్షితులు ఇంట్లోకి నడుస్తూ "రాజమ్మా! వంట మొదలెట్టావా?'' అని అడిగేడు.

బామ్మగారి పేరు రాజమ్మ అని అప్పుడే తెలుసుకున్నాడు రామశర్మ.

"ఇంకా మొదలెట్టటమేమిటి, అప్పుడే సగం అయిపోయేను. ఈ విషయం విన్నారా? సుబ్బావధానికి పురుడంటు వచ్చిందట. మీకు అపోసన ఎవరిచేత వేయించడమా అని సతమత మవుతుంటే భగవంతుడిలా వచ్చాడు ఈ అబ్బాయి కార్యక్రమాన్ని తనే వెళ్ళదీస్తానని ఒప్పుకున్నాడు పాపం'' అని చెప్పింది రాజమ్మ.

"అలాగా'' అని రామశర్మ వైపు చూశాడు దీక్షితులు. తిరిగి రాజమ్మ వైపు చూస్తూ "ఇతగాడెవరో చిన్నవాడిలా వున్నాడు, తల్లీ, తండ్రీ ఉన్నారేమో కనుక్కున్నావా. అలాగైతే పితృకార్యం జరపకూడదు.'' అన్నాడు.

"నేనేం తెలివితక్కువదాన్నా, దీక్షితులు గారూ? అన్నీ కనుక్కున్నాను. ఆ అబ్బాయికి తల్లీ, తండ్రీ. ఎవరూ లేరుట''

"అయితేసరే... నేను కొంచెం ముందుగానే వచ్చిన పనేమంటే - మాకు సూతకం వచ్చింది. ముఖ్యమైన బంధువుల కుర్రాడొకడు చనిపోయాడు. అందుకని నేను బ్రాహ్మణార్థానికి రాను. మరొకరెవర్నైనా ఏర్పాటు చేసుకో.'' అని రాజమ్మ జవాబుకైనా ఎదురు చూడకుండా వెళ్ళిపోయాడు దీక్షితులు. వెళ్తూ, వెళ్తూ రామశర్మ వైపు తీక్షణంగా చూసి మరీ వెళ్ళాడు.

రామశర్మకు అర్థమైంది తండ్రి అలా ఎందుకు చేశాడో. సూతకం వచ్చిందని చెప్పడం కేవలం సాకు మాత్రమే. బంధువుల కుర్రాడు చావడం కేవలం కల్పనే. తల్లిదండ్రులు చనిపోయారని అబద్ధం చెప్పి తను బామ్మగారి భర్తకు తద్దినం పెట్టేందుకు కర్తృత్వం వహించడాన్ని సహించలేక వెళ్ళిపోయాడాయన. ఆయన దృష్టిలో బంధువుల కుర్రాడు చావడమంటే తను చావడమేనని రామశర్మ గ్రహించాడు. మరి కొడుకు చనిపోతే తండ్రికి సూతకమేగా.

రామశర్మలో ఆత్మ విమర్శ మొదలైంది. తను చేస్తున్నది తప్పా? సంతానం లేని ఒక స్త్రీ భర్తకు తద్దినం పెట్టమని అర్థిస్తే ఒప్పుకోవటం తప్పా? ఉద్యోగం లేక పూట గడవ్వని నేడు మార్గాంతరం లేక కాకుండా దొరికిన ఈ అవకాశాన్ని వినియోగించుకుని రెండు పూటలా తిండి, ఐదు రూపాయలూ సంపాదించటం తప్పా? తను చేసిన తప్పు ఒక్కటే. 'తల్లిదండ్రులు పోయారా' అని బామ్మగారు అడిగినప్పుడు కాదని అప్రయత్నంగా జవాబు చెప్పడం. ఒక విధంగా చూస్తే అది అబద్ధమూ కాదు. వచ్చింది [illegible] తిరిగి [illegible]

# ధర్మపథం

— బులుసు వెంకట రమణయ్య

## నమ్మకం లేనప్పుడు-

ఈమధ్య ఒక ప్రయాణంలో ఒక వ్యక్తితో మాటలాడుతున్నప్పుడు సందర్భవశంగా ఆధ్యాత్మిక విషయ ప్రస్తావన వచ్చింది. అతడు "నాకు విగ్రహారాధనపయి నమ్మకం లేదు. ఏ దేవుణ్ణీ నేను నమస్కరించను. దేవాలయాలు నిరుపయోగాలని తోస్తుంది" అని అంటూ తనకు ప్రశాంతి లేదనీ దానికి మార్గమేదో మీకు తెలిస్తే చెప్పండనీ అన్నాడు. ఇట్టి నిశ్చయం కలిగి ఉన్నవారి మనస్సు మారడం కష్టం. వారికి నచ్చచెప్పడం సాధ్యంకాని పని. "అయ్యా! మీకు ఆధ్యాత్మికంలో కొంత ప్రవేశమున్నట్లు తెలుస్తున్నది. విగ్రహారాధన ప్రారంభకులకు ఉద్దేశించబడినది మీరు దానికి అతీతులు" అని చెప్పవలసి వచ్చినది. అంతతో నిలుపక ఆయన "బ్రహ్మజ్ఞులను అడిగి తెలుసుకోవాలన్నా సాధ్యంకాదు. నేను చూసిన సన్న్యాసులందరూ వేషధారులుగానే కానవస్తున్నారు. ఏవో తాత్కాలిక శక్తులను చూపి జనుల్ని స్వాధీనం చేసుకునేవారే చాలా మంది కానవస్తున్నారు. వారిలో ఏదో స్వార్థమే కానవస్తున్నది. ప్రజలను వారు మోసగిస్తున్నారనే నా నమ్మకం. అందువల్ల వారినికూడా నమ్మను" అని అన్నాడు.

"అందరుసన్న్యాసులూ అట్టివారుకారు. వారిలో మహనీయులు లేకపోలేదు. మొత్తం మీద అందరినీనిందించకూడదు. తత్త్వజ్ఞులైన మహనీయులున్నూ ఉన్నారు. వారిని ఆశ్రయిస్తే ప్రశాంతి మార్గం తప్పక తెలుస్తుంది" అని చెప్పగా, అతడు "అందరూ ఒక్కలాగే కానవస్తారు. ఎవరు సరియైన వారో తెలుసుకోవడం సాధ్యంకాని పని. అందువల్ల అయోగ్యులెవ్వరిపైని నాకు విశ్వాసం లేదు" అని ఖచ్చితంగా చెప్పాడు.

అప్పుడు నాకు— శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు కొన్ని దశాబ్దాల కిందట అమెరికన్ తత్త్వాన్వేషి పాల్ బ్రంటను దొరగారికి చెప్పిన మాట జ్ఞప్తికి వచ్చింది. వారు చెప్పిన దేమిటంటే- "మీకు ఎవ్వరూ నచ్చకపోతే- ఇతరులపై ఆధార పడడం మానివేసి స్వయంగానే ధ్యానం అలవాటు చేసుకోవాలి. ఉత్తమ విషయాలను ఆదరానురాగాలతో భావనచెయ్యాలి. తరుచుగా ఆత్మ విషయమై చింతన చెయ్యాలి. ఈ ఆత్మ చింతన ఆత్మను మీ సమీపానికి తెస్తుంది. ఉదయం, సాయంకాలం ధ్యానానికి అనుకూలమైన సమయాలు. పడక నుండి లేవగానే ధ్యానం చెయ్యడం అత్యుత్తమం. ఉదయ, సాయం సమయాల్లో లోకం ప్రశాంతంగా వుంటుంది. ధ్యాన వ్యతిరేక విషయాలు తక్కువగా ఉంటాయి. ఇలా చేస్తే భగవంతుడే తగిన ఉపదేశమిస్తాడు" అని.

తర్వాత అతనేమీ ప్రశ్నించలేకపోయాడు

## కర్త-కర్మ-క్రియ

ఏలాంటిది? "ఛీ. అప్రాచ్యుడా. ఎందుకొచ్చావురా తిరిగి? కని, పెంచి, పెద్దచేసి జాతకర్మ, నామకరణ, ఉపనయన సంస్కారాలన్నీ నీకు చేసినందుకు మాకు నువ్వు చూపిన కృతజ్ఞత ఇంటినుంచి వెళ్ళిపోవడమా? ఆ క్షణం నుంచే నీకు మేము మృతతుల్యులం. మాకూ నీవంటే అంతే. ఇప్పుడు నీకు మేము తల్లిదండ్రులముకాము, నీవు మాకు కొడుకువీ కావు." అన్నాడు తండ్రి. 'అయిందేదో అయింది. వచ్చినవాణ్ని తిరిగి వెళ్ళమనకండి. ఎంత కాదనుకున్నా వాడు మనకు జ్యేష్ఠ పుత్రుడు' అని తల్లి కన్నీళ్ళు పెట్టుకుంటే 'జ్యేష్ఠ పుత్రుడు కాదు, జేష్ట పుత్రుడు' అని ఈసడించాడు తండ్రి.

మరి తను తలిదండ్రులు లేరని చెప్పడం అబద్ధమెలా అవుతుంది?

"ఇప్పుడెలా కిష్టప్పా" రాజమ్మ అడిగింది దీక్షితులుతో వచ్చిన రెండవ బ్రాహ్మణుణ్ణి.

"ఏలా ఏముంది రాజమ్మక్కా, నీవు వంట పూర్తి చేసెయ్. నేవెళ్ళి రెండో భోక్తగా ఎవరినైనా పిల్చుకువస్తాను. మా యిద్దరికీ ఇతను అవుపోసన వేస్తాడు. నీ మొగుడి తద్దినం దివ్యంగా వెళ్ళిపోతుంది" అన్నాడు కిష్టప్ప బయటకు వెళ్ళటానికి ఉద్యుక్తుడౌతూ.

మరోగంటలో కిష్టప్ప ఒక వృద్ధ బ్రాహ్మణుణ్ణి వెంటబెట్టుకు రావడం, వారిద్దరూ స్నానాదికాలు పూర్తిచేసుకుని రామశర్మచేత శ్రాద్ధకర్మ తంతు జరిపించడం పూర్తయింది. భోక్తలిరువురూ భోజనం ముగించుకుని, రావలసిన దక్షిణ ఇప్పించుకుని వెళ్ళిపోయారు.

రాజమ్మ రామశర్మకు భోజనం వడ్డించింది. విస్తరినిండాఉన్న నాలుగు కూరలూ, నాలుగు పచ్చళ్ళూ, పప్పూ, గారెలూ, అరిశలూ రామశర్మలోని జిహ్వాచాపల్యాన్ని పరీక్షిస్తున్నై. ఇక అవుపోసన పట్టడమే తరువాయి, సుష్టుగా భోజనం చేయవచ్చు. అపాయింట్ మెంట్ ఆర్డరు చేతికివచ్చింది. ఇక ఫలాన్ని అనుభవించడమే తరువాయి.

రామశర్మ చేతులో నీళ్ళు పోసుకుని అవుపోసన పట్టడానికి ఉద్యుక్తుడైనాడు. కాని మంత్రం గుర్తుకు రాలేదు, ఈ అలవాటును ఎప్పుడో మానుకున్న రామశర్మకు. చేతిలోని నీళ్లను విస్తరి చుట్టూ తిప్పడమే శరణ్యమనిపించింది.

సరిగా అప్పుడే కిష్టప్ప వగర్చుకుంటూ వచ్చాడు. రామశర్మ, రాజమ్మ ఆశ్చర్యంగా చూశారతనివైపు.

"రాజమ్మక్కా! ఇది విన్నావా, ఎంత ఘోరం జరిగిందో? దీక్షితులుగారు ఇక్కడ్నుంచి ఇంటికి వెళ్ళగానే గుండెపోటొచ్చి పడిపోయాడట. డాక్టరొచ్చి చూసి, చనిపోయాడని చెప్పాడట" అన్నాడు కిష్టప్ప.

"నారాయణ, నారాయణ. ఎంతఘోరం" అంటోంది రాజమ్మ.

రామశర్మ చివాలున లేచాడు. బట్టలు మార్చుకోడానికి వరండాలోకి నడిచాడు.

"అదేమిటి బాబూ. భోజనం చేయకుండా ఎక్కడికి వెళ్తున్నావ్" ఆశ్చర్యంగా అడిగింది రాజమ్మ.

రామశర్మ మాట్లాడలేదు. తలవంచుకుని మౌనంగా వీధి వాకిలి దాటేడు, నీ ఉద్యోగం నాకక్కర్లేదని విసవిసా వెళ్ళిపోయే అభ్యర్థిలా.

"బాబూ, రామశర్మా...నీ ఐదు రూపాయలు..." ఆమె మాటలు వీధివాకిలి వరకే వెళ్లగలిగేయి.

